శిశు మరణాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

● డీఎంహెచ్‌వో రాజేందర్

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శిశు మరణాలు నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్ కోరారు. శనివారం పిల్లల మరణాలపై కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. మరణాలకు గల కారణాలు పీహెచ్‌సీల వారీగా తెలుసుకున్నారు. డాక్టర్ నయనారెడ్డి, శ్రీనివాస్, చిన్న పిల్లల వైద్యులు పాల్గొన్నారు.

ఒడిదొడుకుల రాజకీయం


ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో బీజేఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్ రెడ్డి


సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి


- ఈ ఏడాదంతా నేతల నిస్తేజం
- పార్టీలు మారిన జిల్లాలోని సీనియర్ నేతలు
- కాంగ్రెస్, బీజేపీల్లో క్రమంగా ముదురుతున్న గ్రూపులు
- పూర్తిగా తగ్గిపోయిన బీఆర్ఎస్ కార్యకలాపాలు

కాలచక్రం 2024 KALACHAKRAM

నిర్మల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : 2024 సంవత్సరం జిల్లాకు రాజకీయంగా పెద్దగా అచ్చి రాలేదని అంటున్నారు. ఈ ఏడాది దంతా జిల్లాలో ఒడిదొడుకులతోనే రాజకీయ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. గత ఏడాది బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్య జిల్లా అంతటా రాజకీయ ఆధిపత్య పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఈ ఏడాది మాత్రం కేవలం ఈ ఆధిపత్య ధోరణిలన్ని కాంగ్రెస్, బీజేపీలకు మాత్రమే పరిమితమయ్యాయి. మొన్నటి వరకు అధికారంలో కొనసాగిన బీఆర్ఎస్ జిల్లాలో నిస్తేజంతో కొట్టుమిట్టాడుతోంది. అయితే కాంగ్రెస్, బీజేపీల నేతల మధ్య క్రమంగా గ్రూపు తగాదాలు విస్తరిస్తున్నాయి. పదవుల విషయంలోకి వస్తే బీజేపీ తరఫున నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటీ మహేశ్వర్‌రెడ్డికి ఆ పార్టీ అగ్రపీఠం వేసింది. మహేశ్వర్ రెడ్డికి బీజేపీ తమ శాసనసభ పక్షనేతగా పదవి కట్టబెట్టి ప్రాధాన్యత ఇవ్వడం ఈ యేటి విశేషంగా చెబుతున్నారు. అలాగే మైనార్టీ వర్గానికి చెందిన అధికార కాంగ్రెస్ పార్టీ నేత అర్జుమంద్ ఆలీకి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి దక్కింది. ఇదిలా ఉండగా గత ఏడాది వరకు రాజకీయ ఆధిపత్యం కోసం ప్రయత్నించిన బీజేపీ ఆ దిశగా ఈ యేడు వేగమైన అడుగులు వేస్తోంది. ప్రస్తుతం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా వెనకబడిపోగా కాంగ్రెస్, బీజేపీల మధ్యనే నువ్వా నేనా అన్న రీతిలో రాజకీయ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ పార్టీలో కీలకమైన మంత్రిగా కొనసాగిన అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డితో పాటు సిట్టింగ్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండే విఠల్‌లు బీఆర్ఎస్ పార్టీని వీడి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరడం 2024 సంవత్సర రాజకీయ విశేషంగా విశ్లేషిస్తున్నారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ తరఫున ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌గా కొనసాగిన శోభారాణి భర్త ఆ పార్టీ సీనియర్ నేత సత్యనారాయణ గౌడ్ అధికార కాంగ్రెస్ పార్టీలో కాకుండా బీజేపీలో చేరారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మరింత పుంజుకుంది. బీజేపీలో నేతల మధ్య గ్రూపులు కొనసాగుతున్నట్లు ప్రచారం విస్తరిస్తోంది. మొత్తానికి 2024 సంవత్సరం జిల్లాకు రాజకీయంగా ఆశించిన మేరకు ప్రయోజనం చేకూర్చలేదని అంటున్నారు. అన్ని పార్టీల్లోనూ ఒడిదొడుకులతోనే కార్యకలాపాలు కొనసాగుతున్నాయంటున్నారు.

పుంజుకుంటున్న బీజేపీ

కాగా 2024 సంవత్సరంలో బీజేపీ క్రమంగా పుంజుకునే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ పార్టీకి దీటుగా ఏదిగి రాబోయే స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించేందు కోసం బీజేపీ 2024 సంవత్సరాన్ని రాజకీయంగా సద్వినియోగం చేసుకుంది. అయితే ఆ పార్టీకి ప్రస్తుతం నిర్మల్, ముథోల్‌లలో ఎమ్మెల్యేలుండగా ఖానాపూర్‌లో ఆధిపత్యం చాటుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ సంవత్సరం ఆ పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని చేపట్టడమే కాకుండా బూత్‌స్థాయిలో కమిటీల నియామకాన్ని ముమ్మరం చేసి రాబోయే స్థానిక ఎన్నికల్లో కాషాయ జెండాను ఎగురవేసేందుకు ప్రయత్నిస్తోంది. ఇదిలా ఉండగా ఆ పార్టీలో మరో కోణం కూడా తెరపైకి వస్తుందంటున్నారు. నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అలాగే ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డితో పాటు మరికొందరు సీనియర్ నేతల మధ్య బేదాభిప్రాయాలు కొనసాగుతున్నాయని అంటున్నారు. సీనియర్ జూనియర్‌ల వ్యవహారం ఆ పార్టీలో విభేదాలకు ఆజ్యం పోస్తుందని అంటున్నారు. అయితే కేడర్‌లో మాత్రం ఉత్సాహం ఉన్నప్పటికీ గ్రూపు విభేదాలు 2024 సంవత్సరంలో మరింత తీవ్రమయ్యాయని అంటున్నారు.


సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కాంగ్రెస్‌లోనూ..

2024 సంవత్సరం కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా కొంత చేదు.. కొంత తీపి అనుభవాలను చేకూర్చిందని అంటున్నారు. ముఖ్యంగా డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పార్టీని పునర్ నిర్మాణం చేస్తున్న క్రమంలోనే బీఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన వ్యవహారం ఆ పార్టీలో గ్రూపు విభేదాలకు ఆజ్యం పోసింది. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిలు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నప్పటికీ ఎడమొహం పెడ మొహంగా ఉంటుండడం అలాగే వేర్వేరుగా కార్యకలాపాలు నిర్వహిస్తుండడంతో ఆ పార్టీ కేడర్‌లో అయోమయ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇలాంటి పరిస్థితులకు 2024 సంవత్సరం వేదికగా నిలుస్తోంది. అలాగే ఆ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండే విఠల్‌లు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే ముథోల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, విఠల్‌రెడ్డిల మధ్య చాప కింద నీరులా ఆధిపత్య పోరాటం విస్తరించడానికి 2024 సంవత్సరం సాక్ష్యంగా నిలుస్తోంది. ఇదిలా ఉండగా డీసీసీ ప్రెసిడెంట్ శ్రీహరిరావు మాత్రం తన ఆధిపత్య ధోరణిని నిలబెట్టుకుంటూ నామినేటెడ్ పదవుల్లో సీనియర్‌లకు అలాగే తన అనుచరులకు ప్రాధాన్యత కల్పించుకుంటున్నారు. అయితే మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డితో పాటు మాజీ సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్వర్‌ల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయంటున్నారు. ఇదిలా ఉండగా జిల్లా ఇన్‌చార్జీ మంత్రిగా సీతక్క కొనసాగుతున్న కారణంగా ఆమె ఎక్కువ పర్యటనలు జరుపుతున్నారు.

పత్తాలేని బీఆర్ఎస్ పార్టీ

ఇదిలా ఉండగా 2023 సంవత్సరం వరకు అధికారంలో ఉండి ఆధిపత్యం కొనసాగించిన బీఆర్ఎస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల తరువాత తెరమరుగైన విధంగా వ్యవహరిస్తోంది. ప్రస్తుతం ఆ పార్టీ నిర్మల్ నియోజకవర్గంలో తన కార్యకలాపాల జాడ కనిపించకుండా వ్యవహరిస్తోంది. దీంతో పాటు ముథోల్‌లో కిరణ్ కొమురేవార్‌తో పాటు ఒకరిద్దరు నేతలు మాత్రం ఆ పార్టీ అస్తిత్వాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో ఆ పార్టీ నాయకులు జాన్సన్ నాయక్ మాత్రం కొంత మేరకు కేడర్‌కు అందుబాటులో ఉంటూ అడపాదడపా పార్టీ కార్యకలాపాలను నిర్వహిస్తూ పార్టీ మనుగడను నిలిపే ప్రయత్నం చేస్తున్నారు.

పట్టణంలో ఎగ్జిబిషన్ నిర్వహణ

● కలెక్టర్ అభిలాష అభినవ్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :నిర్మల్ జిల్లా కేంద్రం ఎన్టీఆర్ మినీస్టేడియంలో జనవరి 5 నుంచి మూడురోజులపాటు నిర్మల్ ఉత్సవాల పేరుతో నుమాయిష్ (ఎగ్జిబిషన్) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని శనివారం నిర్వహించిన సమావేశంలో అధికారులను ఆదేశించారు. జనవరి 7 వరకు నుమాయిష్ ఉంటుందన్నారు. గ్రామీణాభివృద్ధి, విద్య, పెయింటింగ్స్, హస్తకళలు, మహిళా సంఘాల ఉత్పత్తుల స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి విస్తృత ప్రచారం చేయాలని, హోర్డింగుల ఏర్పాటు, పాఠశాలల్లో కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రదర్శన చూసేందుకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. పార్కింగ్ సమస్య తలెత్తకుండా చూడాలని, లైటింగ్ ఏర్పాట్లు తదితర వాటిపై ఆదేశాలిచ్చారు. స్టాల్స్ ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. ఫోన్ నెంబర్ 9849913071ను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, డీఈవో రామారావు, డీఎంహెచ్‌వో రాజేందర్ పాల్గొన్నారు.

నిర్మల్‌అర్బన్ : ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చేపట్టవలసిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇసుక అక్రమ తవ్వకాలను గుర్తించి, పూర్తిస్థాయిలో నిర్మూలించాలని సూచించారు. వివిధ ప్రభుత్వశాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న నిర్మాణాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలకు అవసరమయ్యే ఇసుకను కేవలం నిబంధనల మేరకు మాత్రమే సేకరించాలన్నారు. ఇందుకు అనుగుణంగా ఆ నిర్మాణాల గుత్తేదారులకు తగు ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఆయా నిర్మాణాలకు అవసరమయ్యే ఇసుక వివరాల నివేదికలను అందజేయాలని సూచించారు. నివేదికల ప్రకారమే ఆయా శాఖలో జరుగుతున్న నిర్మాణాలకు ఇసుక సరఫరా అవుతుందని, గుత్తేదారులు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుకను కొనుగోలు చేయరాదని ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ ఇసుక అక్రమ తవ్వకాలను, రవాణాను అరికట్టాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఏడీ మైన్స్ రవీందర్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు శంకరయ్య, అశోక్ కుమార్, సందీప్ పాల్గొన్నారు.

భిక్షాటన నియంత్రణకు చర్యలు..

భిక్షాటన నియంత్రణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని బాలల సంక్షేమ కమిటీ కార్యాలయాన్ని ఆమె స్థానిక సంస్థల అదనపుకలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి సందర్శించారు. జిల్లాలో కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు, బాల్యవివాహాల నియంత్రణ, అనాథబాలల గుర్తింపు, తదితర అంశాలపై సీడబ్ల్యూసీ సభ్యులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో జనవరి 1 నుంచి భిక్షాటన నియంత్రించేలా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భిక్షాటన నిషేధ చట్టం కఠినంగా అమలు చేయాలని సూచించారు. పట్టణాల్లోని ముఖ్యకూడళ్లలో భిక్షాటన చేస్తున్న వారిని గుర్తించి, పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాల్లో భిక్షగాళ్లకు ఆశ్రయం, ఆహారం, విద్య, స్వయంఉపాధి, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించాలని తెలిపారు. భిక్షాటనను నియంత్రించేలా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. భిక్షాటనను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలీస్ శాఖ ద్వారా ప్రత్యేకటీమ్‌లను ఏర్పాటు చేసి భిక్షాటన నియంత్రణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే జిల్లాలో బాల్యవివాహాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాల్య వివాహాలు చేసిన, ప్రోత్సాహమిచ్చిన సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

పత్తికర్రలను నేలలో కలియ దున్నుకోవాలి

● వ్యవసాయ అధికారి నవీన్


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి నవీన్

పెంబి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతులు దూది ఏరిన తర్వాత మిగిలే పత్తి కర్రలను పోగు చేసి కాల్చకుండా కాటన్‌స్టాక్ శ్రెడ్డర్ యంత్రం సహకారంతో కర్రను చిన్న చిన్న ముక్కలుగా చిప్స్ లాగా కత్తిరించి నేలలోనే కలియదున్నడం వల్ల భూమికి అవసరమైన బయోమాస్‌ను అందించిన వాళ్లమవుతామని పెంబి మండల వ్యవసాయ అధికారి నవీన్ అన్నారు. శనివారం మండలంలోని అంకెన, రాయదారి, పుల్గంపాండ్రి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సాగు ప్రారంభమైన సందర్భంగా ప్రస్తుతం రైతులు పత్తి కర్రలను తొలగించి కుప్పలుగా వేసి కాల్చడం చేస్తున్నారని, దీనికి బదులుగా కాటన్ స్టాక్ శ్రెడ్డర్ అనే యంత్రం సహకారంతో ట్రాక్టర్ ఉపయోగించి పత్తి కర్రలను చిప్స్ లాగా కత్తిరించి నెలలోనే కలియ దున్నడం వల్ల ఎకరానికి సుమారుగా నాలుగు టన్నుల బయోమాస్‌ను నేలకు చేకూర్చిన వాళ్లమవుతామని తెలిపారు. నెలలో కర్బన పదార్థాలు చేర్చడం వల్ల నేల వదులుగా మారి తదుపరి వేసే పంటలకు సంబంధించిన మొక్కల వేళ్ళకు గాలి ప్రసరణ, నీటి లభ్యతను పెంచడంతో పాటుగా వేరు వ్యవస్థ వద్ద సూక్ష్మ వాతావరణాన్ని అభివృద్ధి పరుస్తుందని తెలిపారు. కావునా రైతు సోదరులు తప్పనిసరిగా పత్తి కర్రలను కాల్చకుండా నేలలో కలియదున్నుకోవాలని సూచించారు. కాటన్ స్టాకెశ్రెడ్డర్‌ను ట్రాక్టర్‌కు బిగించి వాడుకోవచ్చని, కేవలం లక్ష నుంచి రెండు లక్షల రూపాయల మధ్యలో ఈ యంత్రం మార్కెట్‌లో అందుబాటులో ఉన్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

● సమగ్రశిక్షా ఉద్యోగుల డిమాండ్


19వ రోజు సమ్మెలో సమగ్రశిక్షా ఉద్యోగులు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యోతి) : ఇటీవల సమ్మెలో పాల్గొని ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగులకు ప్రభుత్వం స్పందించి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సమగ్రశిక్షా ఉద్యోగులు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట గల అమరవీరు స్థూపం వద్ద 19వ రోజు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఖమ్మం జిల్లాకు చెందిన సీసీవో హేమావతి, జనగామ జిల్లా మెసెంజర్ యాకయ్య ప్రాణాలు కోల్పోయినా ప్రభుత్వం స్పందించక పోవడం శోచనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గత 20 ఏళ్లుగా 150కి పైగా ఉద్యోగులు మృతి చెందారని, అయినా ఉద్యోగులకు న్యాయం జరుగలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, 30 శాతం వేయి టేజ్ ఇవ్వడంతోపాటు విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. అధ్యక్షుడు గంగాధర్, రాజారత్నం, గజేందర్, నరేందర్, ప్రభ, తిరుమల, నవిత, ఉద్యోగులు పాల్గొన్నారు.

టీయూసీఐ నూతన కార్యవర్గం ఏర్పాటు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా టీయూసీఐ నూతన కార్యవర్గాన్ని జిల్లా మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... అధ్యక్షులుగా ఎం.బక్కన్న, ఉపాధ్యక్షుడిగా ఎస్. గంగన్న, ప్రధాన కార్యదర్శిగా ఆర్.రామలక్ష్మణ్, సహాయ కార్యదర్శిగా ఎండీ గఫార్, కోశాధికారిగా కే.సాయన్న ఎన్నికైనట్లు తెలిపారు. కార్యవర్గసభ్యులుగా కే.లక్ష్మీ, గంగామణి, రేష్మ, దేవవ్వ, కిషన్, పోశెట్టి ఎన్నికయ్యారని పేర్కొన్నారు. సమగ్రశిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, బీడీ పరిశ్రమ నిర్వీర్యం చేసే కోర్టాఫ్ చట్టం రద్దు, తదితర వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

'ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి'

పెంబి / (ఖానాపూర్), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. ఖానాపూర్ పట్టణంలో మధ్యాహ్న భోజనం కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని సందర్శించి, మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు అనేక వాగ్దానాలు ఇచ్చింది. ఆ వాగ్దానాలను అమలు చేయాలని ఇప్పటికే రైతులు, కార్మికులు, ఉద్యోగులు పోరాటాలు నిర్వహిస్తున్నారని, ఆ పోరాటాలకు భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ సీపీఐఎం నిర్మల్ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని, కార్మికులకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం కార్మికులకు రూ. 10,000ల వేతనం చెలిస్తామన్న హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసే దిశగా కృషి చేయాలన్నారు.

బీజేపీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలి

● ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్


మాట్లాడుతున్న ముథోల్ శాసనసభ సభ్యులు పవర్ రామారావు పటేల్

లోకేశ్వరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టాపూర్‌లో పోలింగ్ బూత్-201 కమిటీ ప్రకటన, అధ్యక్ష, కార్యదర్శులకు సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముథోల్ శాసనసభ సభ్యులు పవర్ రామారావు పటేల్ మాట్లాడారు. బీజేపీ కోసం సిద్ధాంతానికి కట్టుబడి ఉండి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు అంజికుమార్ రెడ్డి కమిటీ సభ్యులు, మహిళా సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా ఇటీవల మరణించిన మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌కు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు నారాయణ రెడ్డి, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ రాజేష్ బాబు, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్, జిల్లా కార్యదర్శి నల్ల రమేష్, లోకేశ్వరం మండల మాజీసర్పంచ్ ఎం.శ్రీధర్, లోకేశ్వరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీచైర్మన్ చిన్నారావు, మండల ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి మహేందర్ రెడ్డి, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కైరి శ్రీకాంత్ గౌడ్, మోర్చా కార్యదర్శి ఓడ్నాల మురళి, మహిళా మోర్చా అధ్యక్షురాలు అనసూయ, మాజీసర్పంచ్‌లు సాయన్న, రాజుర ఎంపీటీసీ పోతన్న, ఉపసర్పంచ్ ప్రవీణ్, భాస్కర్, పోలింగ్ బూత్ నూతన అధ్యక్షుడు కైరి మహేష్ గౌడ్, నూతన కార్యదర్శి కొండూరి భూమేష్, ఉపసర్పంచ్ శ్రీధర్, మనోజ్ కుమార్, మహిళా గౌరవ సభ్యులు సుంకరి సత్యక్క, గట్టు కమల పాల్గొన్నారు.



గిరిజన విద్యార్థినికి ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి

గురుకుల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు

ఉట్నూర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాలలో చదువుతున్న ఉత్తమ బాలికలకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ల్యాప్ టాప్‌లను శనివారం తన చాంబర్‌లో పంపిణీ చేశారు. 2023-24 విద్యా సంవత్సరంలో స్టార్ 50లో చదివిన విద్యార్థులు ప్రాఖ్యత పొందిన ఎన్ఐటీ, అగర్తలలో నలుగురు గిరిజన విద్యార్థులు నీలిమ, పద్మ, శైలజ, నవీన ప్రవేశం పొందినార న్నారు.వారికి గురుకులం ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్‌లు అందించడం జరిగిదని ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా తెలిపారు.విద్యార్థులను ఉద్దేశిస్తూ పీఓ మాట్లాడుతూ ఇలాంటి మరిన్ని విజయాలు, భవిష్యత్‌లో సాధించాలన్నారు. ఆర్‌సీఓ అగస్టియన్, స్టార్ -50 కో ఆర్డినేటర్ మారుతిశర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాయిసెంటర్ వార్షికోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి : రామ్‌కిషన్

ఉట్నూర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతియేటా డిసెంబర్ 31న జిల్లా రాయిసెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించే వార్షికోత్సవం వేడుకలను ఐటీడీఏ ద్వారా అధికారికంగా నిర్వహించాలని ఆదివాసీ ప్రధాన్ జన జాతి ఉద్ధాన్ సంఘటన్ జాతీయ ఉపాధ్యక్షుడు సిడాం రామ్‌కిషన్ కోరారు. శనివారం ఐటీడీఏ ఏపీవో జనరల్ వసంతరావుకు వినతిపత్రం అందజేశారు. 1986 నుంచి ప్రతియేటా డిసెంబర్ 31న అప్పటి ప్రాజెక్టు అధికారులు, అప్పటి సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ స్వర్గీయ మడావితుకారంల ఆధ్వర్యంలో మావనాటే మావారాజ్ నినాదంతో ఆదివాసీ గిరిజనులతో కలిసి వార్షికోత్సవం నిర్వహించే వారని అన్నారు. ఈసమావేశంలో ఐటీడీఏ ద్వారా చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించే వారన్నారు. ఈ అనవాయితిని పూర్తిగా అధికారులు మానివేశారని ఇప్పటికైనా పునరుద్ధరణ చేయాలని కోరారు. ఆయన వెంట మేస్రంశంకర్, గేడం మాధవ్ తదితరులున్నారు.

రూ.వంద తగ్గిన పత్తి ధర : సీసీఐ

బోథ్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్ పరిధిలో సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న పత్తి ధర వంద రూపాయలు తగ్గిస్తున్నట్లు సీసీఐ అధికారులు తెలిపారు. జనవరి 2నుంచి జరపనున్న పత్తి పంట క్వింటాల్‌కు వంద రూపాయలు తగ్గించి రూ.7421 కొనుగోలు చేయనట్లు సీసీ అధికారులు తెలిపారు. అయితే రైతులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పత్తి పంటలను తీసుకురావాలని మార్కెట్ కమిటీ కార్యదర్శి విట్టల్ పేర్కొన్నారు.

విధుల్లో చేరిన బోధనేతర సిబ్బంది

నిర్మల్ అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ అర్బన్ కేజీబీవీలో పని చేస్తున్న బోధనేతర సిబ్బంది సాయంత్రం 5 గంటల నుండి విధుల్లో చేరుతున్నట్టు తెలిపారు. శనివారం డీఈవోను కలిసి విధుల్లో చేరుతున్నట్టు లేఖను అందించారు. 9 మంది సిబ్బంది విధుల్లో చేరారు. సెక్టోరియల్ అధికారి సలోమి కరుణ, పరీక్షల అధికారి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బుల్లెట్ రెడ్డి సినిమా షూటింగ్

బోథ్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర అర్బన్ పార్క్‌లో గత రెండు రోజుల నుండి నిర్వహించిన బుల్లెట్ రెడ్డి సినిమా షూటింగ్ శనివారం సాయంత్రం ముగిసింది. శుక్రవారం రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. అయితే శనివారం షూటింగ్ జరుగుతున్న విషయం తెలుసుకున్న ప్రజలు జలపాతం వద్దకు తరలివచ్చారు. హీరో హీరోయిన్లను షూటింగ్ తీరును చూసేందుకు ప్రజలు రావడంతో స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అంతేగాక జలపాతం వద్ద అటవీ శాఖ అధికారులు సైతం బందోబస్తు చేపట్టారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నిర్మల్ పట్టణ సబ్ స్టేషన్ కలెక్టరేట్ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 11:30 నుండి 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

'అంధత్వ నివారణ కోసం కృషి'

నేరడిగొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని నేరడిగొండ పీహెచ్‌సీ వైద్యులు డా.ఎండీ సద్దాం అన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం కేజీబీవీ విద్యార్థులకు కంటి చూపు పరీక్షలు నిర్వహించి సంస్థ ద్వారా దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు కంటి అద్దాలు అందజేశారు. కంటి సమస్యలు ఉన్న విద్యార్థులు పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ మండల అప్తాల్మిక్ ఆఫీసర్ భాస్కర్‌రావ్, ఫార్మాసిస్టు శ్రీనివాస్, కేజీబీవీ హాస్టల్ ఇన్‌చార్జీ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎంపీ పరామర్శ

నేరడిగొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నేరడిగొండ గ్రామమాజీ సర్పంచ్ ఏలేటి రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందగా శనివారం ఆయన కుటుంబాన్ని ఆదిలాబాద్ ఎంపీ గోడంనగేష్ పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన సర్పంచ్‌గా ఉన్నప్పటి నుంచి మంచి పరిచయమని అలాగే వీడీసీ చైర్మన్‌గా 20సంవత్సరాలు సేవలు అందించి గ్రామ అభివృద్ధికి పాటు పడ్డారు. ఆయన సేవలను కొనియాడారు. ఆయన మృతి పట్ల సంతాపం ప్రకటించారు. ఆయన వెంట నాయకులు గాడెశంకర్, రాజేశ్వర్ తదితరులున్నారు.

'ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి'

నార్నూర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ)ఉద్యోగులను పర్మినెంట్ చేసి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని చంద్రశేఖర్ లోకెండే జిల్లా ఉపాధ్యక్షుడు మాలా మహానాడు ఆదిలాబాద్ జిల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వారి వెంట నాయకులు నాందేవ్‌జాడే రాజు నరహరి తదితరులున్నారు.

సబ్సిడీపై వరి విత్తనాలు : ఏవో

నర్సాపూర్(జీ), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రైతు వేదిక లో ఎన్ఎఫ్ఎస్ఎం స్కీం కింద సబ్సిడీ వరివిత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మం డల వ్యవసాయ అధికారి రామ్‌చందర్ తెలిపారు. మండలంలోని రైతులు సద్వి‌ని యోగం చేసుకోవాలన్నారు. వడ్లబ్యాగులు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పట్టా పాస్ బుక్ జిరాక్స్ తీసుకొని రైతు వేదికకు రావాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

గవర్నర్ దృష్టికి సీఆర్టీల సమస్యలు

● ఎమ్మెల్యే పాయల శంకర్ ● సీఆర్టీలకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి ● 13వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె



సీఆర్టీల సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఉట్నూర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ముదు సీఆర్టీలు చేపట్టిన సమ్మె విషయం రాష్ట్ర గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించాలని కోరుతానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సీఆర్టీల సమ్మె శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తుందని, అదే మాదిరి నిరుద్యోగులకు, కాంట్రాక్టు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అయితే మరిచి పోతుందని అన్నారు. 13 రోజులుగా సీఆర్టీలు చేస్తున్న సమ్మె వల్ల గిరిజన విద్యారంగం ఇబ్బందుల పాలు అవుతున్న ప్రభుత్వం ఏ మాత్రం స్పందించక పోవడం విడ్డూరమన్నారు. 48గంటల్లో సమస్య పరిష్కరించేలా గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి తెలిపి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామన్నారు. ఇందులో రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేష్, జిల్లా నాయకులు బానోతు జగన్, దేవదాస్, శ్రీకాంత్, కైలాస్, పెంబినగేష్, రాజేశ్వర్ తదితరులున్నారు.

● **ప్రభుత్వం పట్టించుకోవడం లేదు : కోవ లక్ష్మి**

గిరిజన విద్యారంగంలో గిరిజన విద్యార్థుల నష్టపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని, సీఆర్టీల సమ్మెపై స్పందించడం లేదని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే లక్ష్మి ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలకు, నిరుద్యోగులకు, కాంట్రాక్టు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను పూర్తిగా రేవంత్‌రెడ్డి విస్మరిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నప్పుడూ సీఆర్టీల వేతనాలు పెంపుదల చేశామని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సీఆర్టీలు ఎప్పుడో రెగ్యూలర్ అయ్యేవారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సీఆర్టీలకు అన్యాయం జరుగు తోందన్నారు. అధికార పక్షంలో ఉన్న ఖానాపూర్ ఎమ్మెల్యేవెడ్మబొజ్జు సీఆర్టీల సమ్మె శిబిరం సందర్శించచక పోవడం, వారి సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయక పోవడం బాధకరమన్నారు. ఆమె వెంట మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్‌జనార్దన్, తుడందెబ్బ మహిళ నాయకురాలు ప ఎందూరుపుష్పరాణి, ధరణిరాజేశ్, ఆడే సురేష్, రాథోడ్ రమేష్ తదితరులున్నారు.

● **అంబేద్కర్ విగ్రహానికి వినతి**

ఉట్నూర్ ఐటీడీఏ ముందు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఆర్టీలు తలపెట్టిన సమ్మె 13వ రోజుకు చేరింది. శనివారం సమ్మె శిబిరం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు వెయ్యి మంది సీఆర్టీలు ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. రాజ్యాంగ నిర్మాత ఈ ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, వంశీ, శంకర్, విజేష్, బాబురావు, మునినాయక్, బద్దులాల్, కమలాకర్, రామచందర్, విద్యారాణి, వందన, తదితరులున్నారు.

● **'మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి'**

ఆదిలాబాద్ రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే పాయల శంకర్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. మున్సిపాలిటీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఈఎస్ఐ, పెరిగిన నిత్యావసర ధరకు అనుగుణంగా రూ.26 వేల వేతనం చెల్లించేలా చూడాలని కోరారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అసెంబ్లీలో కార్మికుల సమస్యలపై చర్చిస్తామన్నారు. అలాగే వేతనాలు పెంచే విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల స్వామి, యూనియన్ శ్యాం, కుమార్, గౌస్, నగేష్, ఖాజా, జనార్థన్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేయని కాంగ్రెస్

● **బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఏ గ్రామంలో పోయిన అక్కడ ఓ డిక్లరేషన్ ఇచ్చిందని, కానీ దాన్ని అమలు చేయడం లేదని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని ఆయన శనివారం సందర్శించి సంఘీభావం తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోసం కాంగ్రెస్, సీఎం రేవంత్ రెడ్డి హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన విస్మరించారని ఆరోపించారు. ఆయన నిర్లక్ష్యం కారణంగా చదువులు చెప్పే ఉపాధ్యాయులు రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు మూతపడ్డాయని తెలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత మాజీ సీఎం కేసీఆర్ చాలా హామీలు అమలు చేశారని, కొన్ని పూర్తి కాలేక న్యాయం జరగలేదన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం మేమే రాగానే ఇది చేస్తాం.. అది చేస్తామని అనేక హామీలు ఇచ్చి పట్టించుకోవడం లేదన్నారు. ఇదిలా ఉంటే రెగ్యులర్ చేయాలని 19 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఉద్యోగులు నిరసన కొనసాగిస్తున్నారు. శనివారం కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో అర్ధనగ్న ప్రదర్శన ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు రాష్ట్ర అధికార ప్రతినిధి పడల రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధరం సింగ్,పార్థసారథి, దేవదర్శన్, ప్రకాష్, ప్రియాంక, రాజన్న, శ్రీకాంత్, భోజన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

● **పల్లెల ప్రగతికి సహకరించాలి**

తాంసి: పల్లెల ప్రగతి కోసం పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని గిరిగావ్, జామిడి, తాంసి, పొన్నారి, తదితర గ్రామాలలో మృతి చెందిన కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. గ్రామాలలో నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతులైన యువత అభివృద్ధి పథం వైపు ప్రయాణించాలన్నారు. ప్రతీ గ్రామంలో అభివృద్ధి సంక్షేమ పథకాల అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

● **సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం**

నేరడిగొండ: పేద ప్రజలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం కోసమే ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించడం జరిగిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మండలంలోని వాంకిడి గ్రామానికి చెందిన మోగిలి లక్ష్మికి మంజూరు అయిన రూ.16,500 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలు అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందితే ఆ బిల్లులను తమ దగ్గర సమర్పించి సీఎంఆర్ఎఫ్ అందుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్‌సజన్, ప్రతాప్, మహేందర్‌రెడ్డి, సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన డీఈవో

నిర్మల్ రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపేట్ కేజీబీవీలో శుక్రవారం పలువురు విద్యార్థినులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. విద్యార్థులు సహకరించాలని, అందించిన భోజనాన్ని సమయానికి తీసుకొని చక్కగా చదువుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది తమ ఉద్యోగం, వేతనాల పెంపు కోసం సమ్మె చేస్తున్నారని, వారు సమ్మె విరమించేంత వరకు ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందితో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని, విద్యార్థులు వారికి సహకరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాత్కాలికంగా ఏర్పాటు చేయబడిన ప్రత్యేక అధికారి దేవి ప్రియను అడిగి అక్కడి పరిస్థితిని తెలుసుకున్నారు. ఇందులో తాత్కాలిక ఉపాధ్యాయురాలు, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రెటరీ భానుమూర్తి, తదితరులున్నారు.

మురికి కాలువ నిర్మాణం పై నిలదీత

బోథ్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): బోథ్ గ్రామపంచాయతీలో శనివారం గ్రామసభను నిర్వహించారు. సమావేశానికి కేవలం 15 మంది వరకే హాజరయ్యారు. ఎంపీడీవో రమేష్‌తో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి గ్రామపంచాయతీ ఈవో అంజయ్యతో పాటు పలువు గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎమ్మెల్యే క్యాంపు సమీపంలో నిర్మిస్తున్న మురికి కాలువను ఏ నిధులతో చేస్తున్నారని గ్రామస్థులు అడగడం జరిగింది. మురికి కాలువ నిర్మాణానికి గ్రామ పంచాయతీ నిధులు వాడవద్దని సూచించారు. దీంతో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిధులు మురికి కాలువలకు కేటాయించవద్దని ప్రజలు కోరుతున్నందున గ్రామపంచాయతీ నిధులు కేటాయించవద్దని సూచించారు. దీంతో ఈవో సైతం పంచాయతీ నిధులు కేటాయించామని సభ్యులకు తెలిపారు. కాగా మురికి కాలువ నిర్మాణంఎలాంటి తీర్మానం లేకుండా చేపట్టారని పలువురు సమావేశంలో పేర్కొనగా అక్టోబరు 2న తీర్మానం చేయడం జరిగిందని ఈవో పేర్కొన్నారు. తీర్మానం కాపీని ఎంపీడీవో సహితం పరిశీలించడం జరిగింది.

జిల్లా జైలులో టీబీపై అవగాహన

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా జైలులో టీబీ క్యాంపు వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ నిక్షయ శిబిర్ కార్యక్రమంలో భాగంగా జైలులోని ఖైదీలకు టీబీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఖైదీలకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, జైలు పర్యవేక్షణ అధికారి అశోక్ కుమార్, జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్ సుమలత, వైద్యులు సాయిప్రియ, సయ్యద్ అన్సారీ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు

ఇంద్రవెల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి గురించి ప్రణాళికలు తయారు చేయాలని తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని ధన్నోర్(బి) గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. 2025-26 పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. గ్రామాల్లో చేపట్టాల్సిన రోడ్లు, డ్రైనేజీ, కాలువలు, మురుగు తొలగింపు, శానిటేషన్, తదితర అంశాలపై ప్రణాళిక తయారు చేయాలన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఇందులో ఎంపీవో జీవన్‌రెడ్డి, పంచాయితీ ఈవో ప్రవీణ్, గ్రామస్థులు, తదితరులున్నారు.

బరంపూర్ కొండపై అన్నదానం

తలమడుగు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బరంపూర్ కొండపై స్వయంభుగా వెలిసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శని త్రయోదశి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేసి మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ముడుపు కేదారేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ప్రతి శనివారం రెండు వేల మందికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే స్వామివారికి పుష్పాభిషేకం, పంచామృతంతో అభిషేకం ఇతర ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.



సిరికొండలో కమ్ముకున్న పొగమంచు

కమ్ముకున్న దట్టమైన పొగమంచు

సిరికొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సిరికొండలో శనివారం దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఉదయం ఆరు గంటల నుంచి 8 గంటల వరకు దగ్గరకు వచ్చేంత వరకు సైతం ఎదుటివారు కనిపించనంతగా మంచు వ్యాపించింది. చలి తీవ్రతకు తోడు పొగమంచు కమ్మేయడంతో పలువురు వాహనదారులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. హెడ్‌లైట్ల వెలుతురులో ప్రయాణం సాగించారు.

● **తగ్గుముఖం పట్టిన చలి**

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లాలో గత వారం రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో చలి తీవ్రత తగ్గుముఖం పట్టింది. శనివారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 31.3 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 17.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే తాంసి మండలంలో 17.1, భీంపూర్‌లో 17.3, నేరడిగొండలో 17.6, బేలలో 17.9, జైనథ్‌లో 18.1 జిల్లావ్యాప్తంగా 20 కనిష్ఠ డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగలంతా ఆకాశం మేఘావృతమై కనిపించడంతో చలి ప్రభావం తగ్గుముఖం పట్టిందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా గత రెండు రోజులుగా జిల్లావ్యాప్తంగా అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తున్నాయి.

కాలచక్రం 2024

ఆదిలాబాద్‌లో వలసల రాజకీయం

(5వ పేజీ తరువాయి...)

బ్యాంకు భారీ గా పెరిగిందని చెప్పవచ్చు. ఉత్తర తెలంగాణలో బలపడుతున్న బీజేపీని దెబ్బతీసేందుకు కాంగ్రెస్ పార్టీ జిల్లాపై ప్రత్యేకదృష్టిని సారించిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లా నుంచే మోదీ ప్రచారం

2024 మే 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికలకు జిల్లా నుంచే ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మొదటిసారిగా ఆదిలాబాద్ జిల్లాకేంద్రం నుంచే మోదీ బీజేపీ తరఫున ప్రచారాన్ని ప్రారంభించారు. అసలు విషయం ఏమిటంటే పార్టీ అభ్యర్థిని ప్రకటించక ముందే మోదీ బీజేపీ తరఫున పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారాన్ని నిర్వహించారు. ఆ తర్వాతనే అభ్యర్థిని ఖరారు చేసి బీజేపీ ఎన్నికల బరిలో దిగింది. అలాగే ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గవర్నర్ తమిళిసై, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి వర్చ్యువల్ విధానంతో రూ.56 వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టు పనులకు శంఖుస్థాపనలు చేసి దేశ ప్రజలకు అంకితం చేశారు. జిల్లా వేదికగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానిమోదీ తొలిసారి అధికారికంగా కలుసుకున్నారు. 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఎన్టీపీసీ రెండవ యూనిట్‌ను ప్రారంభించారు. అంబారి-ఆదిలాబాద్-పింపాలకుట్టి రైలు మార్గాల విద్యుదీకరణ పనులతో పాటు ఆదిలాబాద్-బేల, ములుగు జిల్లాలో రెండు ప్రధానమైన జాతీయ రహదారి ప్రాజెక్టులకు శంఖుస్థాపన చేశారు. మొత్తానికి 41ఏళ్ల తర్వాత ప్రధాని మోదీ జిల్లాలో పర్యటించడం ఇదే మొదటిసారి అని రాజకీయ వర్గాల్లో తీవ్రమైన చర్చ జరుగుతోంది.

కాషాయం వదిలి కాంగ్రెస్‌లో చేరి..

మునుపెన్నడూ లేనివిధంగా ఆదిలాబాద్ పార్లమెంట్‌లో తొలిసారి కాషాయ జెండాను ఎగుర వేసిన తాజా మాజీ ఎంపీ సోయం బాపురావు ఇటీవలే కాషాయ జెండాను వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గడిచిన పార్లమెంట్ ఎన్నికల్లో సిట్టింగ్ అభ్యర్థిని కాదని కొత్త అభ్యర్థికి అవకాశం కల్పించడంతో సోయం తీవ్ర నిరాశకు గురయ్యారు. అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలకు అంటిముట్టనట్లుగానే ఉంటూ ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఆయనతో పాటు ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కాంగ్రెస్ కండువా వేసుకున్నారు. దీంతో కాంగ్రెస్‌కు ఆదివాసీల్లో కొంత పట్టు దక్కిందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. భవిష్యత్తులో సోయంకు ప్రొటోకాల్ పదవి వస్తుందన్న ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించే దిశగా కాంగ్రెస్ ప్రత్యేక దృష్టిని సారిస్తుంది. వలసలతో కొంత బలపడిన కాంగ్రెస్‌కు ఓటర్లు ఏ మేరకు మద్దతుగా నిలుస్తారో? వేచిచూడాల్సి ఉంది.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీఐ

సోన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సీఐ కే.నవీన్ కుమార్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌లో ఉన్నటువంటి రికార్డులను పరిశీలించారు. పోలీసులకు కేసుల గురించి వివరాలు తెలిపారు. ముందు జాగ్రత్తగా పోలీసులతో మాట్లాడి విధి నిర్వహణలో ఎలాంటి సంఘటనలు జరుగకుండా సక్రమంగా విధులు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ అహ్మద్, సోన్ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఇచ్చోడ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జున్ని గ్రామానికి చెందిన అడిగె జనార్దన్(50) గత కొంతకాలంగా మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం.. జున్ని గ్రామానికి చెందిన జనార్థన్ మద్యానికి బానిసవ్వడంతో తనలో తాను కుమిలిపోయి మనోవేదనకు గురయ్యేవాడు. దీంతో శనివారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో పొలానికి వెళ్తానని ఇంట్లో చెప్పి సమీపంలోని హనుమాన్ క్రషర్ సమీపంలో ఉన్న చెట్టుకు ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

● **రుయాడిలో ఒకరి ఆత్మహత్య**

తలమడుగు: మండలంలోని రుయాడి గ్రామానికి చెందిన మీదమ్ గంగన్న(41) అనే వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు. వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణం దుర్గనగర్‌కి చెందిన గంగన్న గత మూడు నెలల క్రితం రుయ్యడి గ్రామానికి బతుకుదెరువు కోసం వలస వచ్చి తాగుడుకు బానిస అయ్యాడు. దీంతో భార్య మద్యం తాగవద్దని మందలించడంతో క్షణికావేశంతో శనివారం రాత్రి గ్రామ సమీపంలో గల పాడుబడ్డ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు.

వివాహిత అదృశ్యం

నర్సాపూర్(జి), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుస్లి గ్రామానికి చెందిన గన్నారం రాజశేఖర్ భార్య గన్నారం మల్లీశ్వరి(30) ఈ నెల 26న మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదు. కాగా, ఆమె తల్లి చాతల అంజనాబాయి శనివారం నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఎస్సై సాయికిరణ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆదర్శనగర్ సబ్ స్టేషన్ పరిధిలోని విన్నర్ స్కూల్ వద్ద విద్యుత్ పోల్‌ను కారు ఢీకొనడంతో ఆ ప్రాంత వాసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. శనివారం మధ్యాహ్నం పోల్ డామేజ్ కావడంతో సుమారు మూడు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

'పెండింగ్ వేతనాలు చెల్లించాలి'

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అన్నారు. శనివారం గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందన్నారు. ఆరు నెలల నుంచి వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇందులో కిరణ్, విలాస్, అరవింద్, రఫీ, శంకర్, రాజు, ఇంద్రజ్, లస్మన్న పాల్గొన్నారు.

ఎంపీడీవోకు కార్మికుల వినతి

ముథోల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముథోల్‌లో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రెండు రోజులుగా పారిశుధ్య కార్మికులు చేస్తున్న టోకెన్ సమ్మె శనివారానికి ముగిసింది. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో శివ కుమార్‌కు అందజేశారు. ప్రభుత్వం తక్షణమే మా సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని కోరారు. లేనియెడల జనవరి 4వ తేదీ నుంచి సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మిక సభ్యులు అశోక్, బి.శంకర్, ఎస్.లక్ష్మణ్, భూమన్న, జి.త్రిశూల, రాం బాబు, తదితరులు పాల్గొన్నారు.



ముథోల్‌లో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు సర్వర్ సమస్య



గ్రామాల్లో సర్వే చేస్తున్న దృశ్యం

- గడువు దగ్గర పడుతున్నా పూర్తికాని సర్వే
- మండలంలో 9,364 ఇందిరమ్మ దరఖాస్తుదారులు
- నేటికి పూర్తి అయింది 55 శాతం
- పలు గ్రామాల్లో సిగ్నల్ సమస్య



వివరాలు నమోదు చేస్తున్న అధికారి

ముథోల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మించడానికి ప్రభుత్వ అధికారులతో, సిబ్బందితో ఆన్‌లైన్ సర్వేలు నిర్వహిస్తోంది. కొద్దిరోజుల నుంచి సర్వేకు సర్వర్ సమస్యలు రావడంతో ఆన్‌లైన్ చేయడంలో జాప్యం జరుగుతుండడంతో సర్వే నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాస్తూ సర్వే నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు సర్వేను త్వరితగతిన తప్పులు లేకుండా నిర్వహించాలని సూచిస్తున్నారు. సర్వర్ ఆన్‌లైన్ సమస్యలతో ఉన్నతాధికారులు ఇచ్చిన రోజువారి సర్వే లక్ష్యాన్ని చేరుకోలేక ఇబ్బంది పడుతున్నారు. డిసెంబరు నెల చివరి వరకు సర్వే పూర్తి చేయాలని జిల్లా అధికారులు సూచించారు. కానీ మండలంలో కొన్ని గ్రామాల్లో సర్వర్ సమస్యతో పాటు సిగ్నల్ సమస్య ఎదురవు తుందని సంబంధిత సర్వే సిబ్బంది పేర్కొంటున్నారు. మండలంలో 19 గ్రామ పంచాయతీలకు గాను 24 గ్రామాల నుంచి మొత్తం 9,354 మంది ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేసేందుకు సుమారు 27 మంది సిబ్బంది క్షేత్ర స్థాయిలో వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. అయితే శనివారం నాటికి మండలంలో 5,150 ఇళ్లసర్వేను పూర్తి చేసినట్లు ఎంపీడీవో శివకుమార్ తెలిపారు. అంటే సుమారు 55 శాతం సర్వే పూర్తయింది. సర్వర్ సమస్య లేకుంటే రోజుకు 35 నుంచి 40 ఇళ్ల వరకు సర్వే చేయవచ్చని కానీ సర్వర్, సిగ్నల్ సమస్యతో రోజుకు 15 నుంచి 20 ఇళ్లు పూర్తి కావడం లేదని సర్వే సిబ్బంది పేర్కొంటున్నారు. దీంతో పాటు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామాల్లో సర్వేచేసిన సంబంధిత దరఖాస్తుదా రులు అందుబాటులో లేకపోవడం, సర్వర్ సమస్యతో అలస్యం అవుతుందని పేర్కొంటున్నారు. ఏదిఏమైనా ఈ ఇందిరమ్మ ఇళ్ల సర్వే మరో పక్షం రోజులు కొనసాగేటట్లు ఉందని పలువురు అంటున్నారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి ఎంపీడీవో శివకుమార్‌కు వివరణ కోరగా ఇప్పటి వరకు 55 శాతం సర్వే పూర్తి అయ్యిందని తెలిపారు. సర్వర్ సమస్యతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఏదిఏమైనా అయినంతమట్టుకు త్వరలోనే సర్వే పూర్తి చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందు కెళ్తున్నట్లు వివరించారు.

'డంపింగ్ యార్డ్ నిర్వహణలో అలక్ష్యం వద్దు'

నిర్మల్‌కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : డంపింగ్‌యార్డ్ నిర్వహణలో అలక్ష్యం వహించవద్దని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం నిర్మల్ సమీపంలోని డంపింగ్ యార్డ్‌ను అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి పరిశీలించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త వేరువే రుగా సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని సూచించారు. సెగ్రి గేషన్ ప్రాంతంలో ప్లాస్టిక్ కవర్లు, డబ్బాలు, పేపర్, తుక్కు, గాజు సీసాలు వేరువేరుగా విభజించి తిరిగి వినియోగమయ్యేలా చూడాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు, అగ్నిప్రమాదాల నివారణ, తదితర చర్యలపై సూచ నలు చేశారు. మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, పశు సంవర్థక అధి కారి బాలిడ్ అహ్మద్, తహసీల్దార్ సంతోష్ ఉన్నారు.

భైంసాలో వానరాల బెడద

భైంసా, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని పలు కాలనీలవాసులు వానరాల బెడదతో బెంబేలెత్తిపోతున్నారు. దినం, రాత్రి అనే తేడా లేకుండా వానర మూకలు స్వైరవిహారం చేస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా నర్సింహానగర్, రాజీవ్‌నగర్, సాయికాటన్, రామ్‌నగర్, ఓవైసీనగర్, గీతానగర్ ప్రాంతాల్లో వీటి బెడద అధికంగా ఉంది. వానరమూకలు తలుపులు తెరిచి ఉన్న ఇళ్లలోకి వెళ్లి దొరికిన వస్తువులను ఎత్తుకెళ్లిపోతున్నాయి. డైనింగ్‌టైబుల్, వంట గదుల వద్దకు వెళ్లి అక్కడి ఆహార పదార్థాలను తింటున్నాయి. వాటిని బయటకు పంపేందుకు యత్నించే వారిపై దాడులకు పాల్పడుతున్నాయి. అంతేకాకుండా ఇళ్లలోని వస్తువులను చిందరవందరగా చేస్తున్నాయి. రోడ్లపై వెళ్లే వాహనదారులపై దాడులకు తెగబడుతున్నాయి. ఇళ్ల అవరణలో పెంచుతున్న వివిధ రకాల పూల మొక్కలను, పండ్ల చెట్లను పీకివేస్తున్నాయి. ఇళ్ల ప్రహరీలు, ప్రవేశమార్గాల వద్ద భైఠాయించి నివాసగృహాలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. మున్సిపల్ అధికార, పాలకవర్గాలు వానరబెడద నివారించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పట్టణ వాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు,



సాయినగర్ కాలనీలో ఇళ్ల ప్రహరీలపై తిష్టవేసిన వానర మూక

జోరుగా కల్తీ కల్లు విక్రయాలు

- ప్రమాదకరమైన అల్ప్రాజోం, డైజోఫాం, అమ్మోనియం వంటి రసాయనాలతో తయారీ
- మత్తుతో చిత్తవుతున్న యువకులు, గ్రామీణ ప్రజలు



కల్తీ కల్లు సీసాలు

నేరడిగొండ, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): మండలంలో కల్తీ కల్లు మూడు పెట్టెలు, ఆరు డ్రమ్ములుగా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లాలోని కల్లు సోసైటీలు అక్టోబర్ మొదటి నుంచి నూతనంగా లక్షల రూపాయల వేలం పాడి దక్కించుకున్నారు. ప్రతి సంవత్సరం దసరా నుంచి కొత్త మాముళ్ల ప్రారంభమవుతాయి. ప్రతి సోసైటీ పరిధిలోని కల్లు డిపోల నిర్వాహకులు లక్షల రూపాయల వేలం పాట పాడి దక్కించుకుంటున్నారంటే ఆదాయం ఏ మేరకు ఉంటుందో అర్థం అవుతుంది. గ్రామాలు, పట్టణ కేంద్రాలు అనే తేడా లేకుండా కల్లు డిపోల నిర్వాహకులు విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీలకు లక్షల రూపాయలు వేలం పాట పాడి వ్యాపారాలను ప్రారంభిస్తున్నారు. స్వచ్ఛమైన కల్లుకు బదులు ప్రాణాంతక మత్తు పదార్థాలు కలుపుతూ కల్లు వ్యాపారులు రసాయన కల్లును తయారు చేస్తున్నారు. దనార్జనే ధ్యేయంగా కల్తీ కల్లును కొందరు వ్యాపారులు తయారు చేస్తూ గ్రామీణ, పట్టణ ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుతున్నారు. రసాయనిక కల్లుల మీద వ్యాపారం చేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నారు. నిషేదిత అల్పజోన్ మత్తు పదార్థాన్ని కల్లులో కలిపేందుకు నేరడిగొండ మండలం కుప్టి తెల్లకల్లు డిపోలో కలిపి మిగితాది అక్కడే మళ్లీ కలిపేందుకు సిద్ధంగా ఉంచారు. మండలంలోని అన్ని కల్లు డిపోలలో, దుకాణాలలో మత్తుపదార్థాలను కలుపుతు జనాన్నిమత్తులో చిత్తు చేస్తున్నారు. కల్లులో అల్పజోం, డైజోఫాం, క్లోరోహైడ్రెడ్ లాంటి ప్రమాదకరమైన మత్తు పదార్థాలను వ్యాపారులు ఉపయోగిస్తూ ప్రజల ప్రాణాలతోచలగాటం ఆడుతున్నారు. డైజోఫాం, క్లోరైడ్ లాంటి మత్తు పదార్థాలతో పాటు అల్టాటలం అనే మత్తు పదార్థాలను వ్యాపారులు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. జిల్లలో చెట్ల నుంచి తీసిన కొద్దిపాటి కల్లులో నీళ్ల పోసి మత్తుమందు కలిపిన అనంతరం తియ్యగా ఉండేందుకు చెక్రిన్‌పౌడర్, పులుపు కోసం ఈస్ట్‌పౌడర్, నురుగు కోసం కుంకుడు రసం పోస్తున్నారు. మరిన్ని హానికరమైన పదార్థాలను ఉపయోగిస్తున్నారు. జిల్లాలోని అన్ని కల్లు దుకాణాల్లో కల్తీ కల్లులభిస్తుంది. పలు కల్లు దుకాణాల్లో ఎక్సైజ్ అధికారుతు తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నారు.



కల్తీ కల్లుకు ఉపయోగించే పదార్థాలు

అంతటా కల్తీమయమే...

గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుం డా, పట్టణాల్లోను విక్రయాలు జోరుగా సాగు తున్నాయి. కష్ట జీవులు అలసటను అదిగమిం చేందుకు కల్లు తాగుతుంటారు. దీనిని ఆసరా చేసుకుని కల్లు వ్యాపారులు మత్తు పదార్థా లతో రసాయనిక కల్లు తయారు చేస్తూ ప్రజలకు అంటగడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కల్తీ కల్లుకు యువకులు, కూలీలు బానసలవుతున్నారు. దీంతో చిన్న వయస్సులోనే మొకాళ్లు, కీళ్ల నొప్పులు, బుద్దిమందగించడం, బీపీ, షుగర్ లాంటి వ్యాధుల భారీన పడుతున్నారు. మత్తులో ఏం చేస్తున్నారో తెలియక పిచ్చిగా ప్రవర్తిస్తున్నారు. కల్తీ కల్లు దొరకని సమయంలో మానసికంగా కుంగిపోతు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. మరికొందరు ఆసుపత్రుల పాలవుతున్నారు. కల్లును అందించడంలో విఫలమవుతున్నారు.ఈత, తాటి చెట్లు పెద్ద మొత్తంలో లేవు ఉన్న వాటి నుంచే కల్లును తీసి గీత కార్మికులు కల్లులో నీళ్లు, మత్తుపదార్థాలు కలుపుతు విక్రయిస్తున్నారు. కల్లు వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా చెట్ల నుంచి గీసిన కొద్దిగా ఉన్న కల్లు రసాయనాలు కలిపి దర్జాగా విక్రయిస్తున్న అధికారులు పట్టించు కోవడం లేదు. ఏరులై పారుతుంది. ప్రజలు మత్తు పదార్థాలకు బానిసై కల్లునే సేవలిస్తున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని వంద మీటర్ల దూరంలో వైన్స్, తెల్లకల్లు డిపోలు ఏర్పాటు చేయాలి కాని కుప్టిలో ఏర్పాటు చేసిన తెల్ల కల్లు దుకాణంయాభై మీటర్లు సైతం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కల్లు తాగే వాళ్ల అప్పుడప్పుడు గొడవలు చేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

దస్తురాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో కత్తి స్వామి, కట్కం వినయ్ కుమార్ సౌజన్య దంపతులు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప మహా పడిపూజను అత్యంత వైభవంగా నిర్వ హించారు. అర్చకులు సాయికృష్ణ దుబే మంత్రోచ్చారణల మధ్య మెట్ల పూజ, పడిపూజ, అయ్యప్ప స్వామికి అభిషేకం నిర్వహించారు. అయ్యప్పస్వామి దీక్షాపరులు ఉత్సాహంగా పాటలు పాడుతూ, నృత్యాలు చేశారు. అయ్యప్ప శరణుఘోషతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. అనంతరం పడిపూజకు తరలివచ్చిన భక్తులకు అన్నదా నం ఏర్పాటు చేశారు.



అయ్యప్ప స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

పగిలిన మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్

భైంసా, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భైంసా- బాసర రోడ్డు మార్గంలోని దేగాం గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం మిషన్ భగీరథ పథకానికి సంబంధించిన ప్రధాన పైప్ లైన్ పగిలింది. అక్కడి ప్రాంతంలో రోడ్డు నిర్మాణ సంస్థ నిర్వాహణ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం మూలంగా పైప్ లైన్ దెబ్బతింది. రోడ్డు నిర్మాణ పనుల్లో బాగంగా దేగాం గ్రామ సమీపంలో మురికి కాలువ ఏర్పాటు కోసం ఎక్స్‌కావేటర్ ద్వారా తవ్వే పనులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అక్కడి భాగంలోని మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్‌కు ఎక్స్‌కావేటర్ బకెట్ తగలడంతో పగిలిపోయింది. దీంతో పగిలినన పైప్ భాగం నుంచి ఫౌంటెన్‌ను తలపించేలా నీరు ఉవ్వెత్తున విరజిమ్మింది. అధిక మొత్తంలో నీరు పక్కనే ఉన్న రోడ్డుపైకి ఉధృతితో ప్రవహించడంతో అక్కడి ప్రాంతాలన్నీ జలమయయ్యాయి. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. కొద్ది సమయం అక్కడి ప్రాంతంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అంతేకాకుండా దేగాం ఎగువ ప్రాంతంలోని ముథోల్ వైపు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. సంబంధిత విషయమై మిషన్ భగీరథ డీఈ ఆదిత్యను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా రోడ్డు నిర్మాణ సంస్థ పనులు చేపడుతుండగా పైప్‌లైన్ పగిలిందని వివరించారు. రాత్రి వరకల్లా కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

రాంనగర్‌లో కబడ్డీ పోటీలు ప్రారంభం

పెంబి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంనగర్‌లో రాంనగర్ కబడ్డీ ప్రీమియర్ లీగ్‌ను చిరుత యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను శనివారం పంచాయతీ సెక్రటరీ కామ్రాన్, గ్రామ కారో బార్ సిద్దునాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... క్రీడలో గెలుపు, ఓటములు సహజ మన్నారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తుం దన్నారు. ఈ క్రీడల్లో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి 10 వేలు, రెండవ బహుమతి 5 వేలు అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రవీ ణ్‌నాయక్, సిద్దునాయక్, మాజీ ఎంపీటీసీ రామారావు, చిరుత యూత్‌సభ్యులు కైలాష్, రవి, నరేందర్, రోహి దాస్, ఉపేందర్, నాందేవ్, రాజేష్, నవీన్ ఉన్నారు. త

అధికారుల నిర్లక్ష్యం.. పేదలకు శాపం

కుంటాల, డిసెంబరు, 28 : (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో నూతనంగా ప్రభు త్వం ఏర్పడిన తర్వాత గత ఏడాది పేదబ డుగు, బలహీన వర్గాల వారందరికి ప్రభు త్వపథకాలను అందించాలనే ఉద్దేశంతో గత ఏడాది డిసెంబర్ నెలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులు స్వీకరించే కార్యక్రమం ఏర్పాటు చేసింది. అంతేగాకుండా స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో క్రోడీకరించి ఆ దరఖాస్తుల ఆధారంగానే తెలం గాణలో ప్రభుత్వం లబ్దిదారుల ఎంపిక కార్యక్రమం చేపడుతోంది. అయితే కుంటాల మండలంలో అప్పటి అధికారుల నిర్లక్ష్యం.. పేదప్రజలకు శాపంగా మారింది. గతంలో స్వీకరించిన దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్‌లో క్రోడీకరించకపోవడం వలన ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో అసలైన లబ్దిదారులకు అన్యాయం జరుగుతోందని లబ్దిదారులు పేర్కొంటున్నారు. తాజాగా మండలకేంద్రం కుంటాలలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహించిన అధికారులు పలు వురు లబ్దిదారుల ఇండ్ల వద్దకు వెళ్లినప్పు డు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని అధికారులు తెలప డంతో లబ్దిదారులు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి వెళ్లినా ఫలితం లేకుండా పోయింది.దీంతో తమకు న్యాయం చేకూర్చాలని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఆన్‌లైన్‌లో క్రోడీకరిం చడంలో నిర్లక్ష్యం వహించిన అధి కారులపై చర్యలు తీసుకోవాలని కుంటాల ఎంపీపీ డిమాండ్ చేశారు.



ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న లబ్దిదారులు

ఈ అన్నం మేం తినలేం!

- వచ్చి తీసుకెళ్లండి తల్లిదండ్రులకు కేజీబీవీ విద్యార్థుల వేడుకోలు
- పిల్లలను తీసుకెళ్లిన తల్లిదండ్రులు

దిలావర్‌పూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఈ మాడిపోయిన అన్నం మేం తినలేకపోతున్నాం. అన్నంలో తోక పురుగులు, బొద్దింకలు వస్తున్నాయి. మీరు వెంటనే వచ్చి మమ్మల్ని తీసుకెళ్లండి అంటూ కేజీబీవీ విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఫోన్ చేయడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పరుగు పరుగున కేజీబీవీకి చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న తహసీల్దార్ స్వాతి తల్లిదండ్రులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ తల్లిదండ్రులు వినలేదు. మా పిల్లలను పంపించాలని కోరారు. గత 19 రోజులుగా సమగ్రశిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెతో కేజీబీవీల్లో బోధన ఆగిపో యింది. విద్యార్థులు ఎలాగోలా చదువుకుంటూ ఉండగా బోధనేతర సిబ్బంది కూడా సమ్మె బాట పట్టడంతో విద్యార్థులకు కష్టాలు మొదల య్యా యి. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా ప్రత్యేక అధికారులతో పాటు వంట చేసే వారిని నియమిం చారు. వంట చేసేవారు కొత్త వారు కావడంతో వారికి సరైన అను భవం లేక పోవడంతో ఆహారం తినలేక విద్యార్థులు 3 రోజులుగా అర్ధాకలితో ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయాన్నే చేయాల్సిన టిఫిన్ 10:30 గంటలకు పెడుతున్నారని ఆరోపించారు. అదికూడా కొద్ది కొద్దిగానే ఇస్తున్నారన్నారు. మొ న్న మాడిపోయిన అన్నం తిన్నాము... దీంతో అం దరం కలిసి నిరసన తెలిపేందుకు సిద్ధమైతే అధి కారులు వచ్చి మరో మారు ఇలా జరుగకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆగిపోయామని, బయటకు తెలిస్తే ఇష్యూ అవుతుందని... ఏదో లే అని సర్దుకుపోయాం... మళ్లీ శుక్రవారం అన్నంలో తోక పురుగులు వచ్చాయి. ఈ రోజు బొద్దింక వచ్చింది. ఇక అన్నం ఎలా తినాలని, అందుకే అమ్మానాన్నలకు ఫోన్ చేశామని విద్యార్థులు తెలిపారు. 18 రోజులుగా విద్యా బోధన జరగకపోవడం పట్ల విద్యార్థుల తల్లిదం డ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో రెండు నెలల్లో పరీక్షలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.




కేజీబీవీ గేటు వద్ద ఎదురుచూస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం...

● కే.శంకర్, ఎంఈవో, దిలావర్‌పూర్

సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మెతో కేజీబీవీలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దు. వంట చేసే వారు కొత్త కావడం వల్ల కొద్దిగా అన్నం మాడిన మాట వాస్తవమేనని, అన్నంలో తోక పురుగు, బొద్దింక వచ్చిందని విద్యార్థులు ఈరోజే తన దృష్టికి తెచ్చారని ఇకముందు అలా జరుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని ఎంఈవో శంకర్ అన్నారు.





● జిల్లాలో ప్రధాని మోదీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలుసుకున్న దృశ్యం(ఫైల్)



● జిల్లా నుంచే దేశవ్యాప్తంగా పలు పథకాలను ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ(ఫైల్)




● మోదీ సభకు హాజరైన బీజేపీ శ్రేణులు

కాలచక్రం 2024

వలసల రాజకీయం..

- బీఆర్‌ఎస్‌కు కలిసి రాని కాలం.. చెల్లాచెదురై పోయిన క్యాడర్
- మద్దతు దక్కకపోయినా.. అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ
- పార్లమెంట్ సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకున్న కమలం పార్టీ
- 41ఏళ్ల తర్వాత జిల్లాకు ప్రధాని మోదీ రాక
- కండువా మార్చి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీ సోయం
- ఓటర్ల తీర్పుతో మారిన జిల్లా రాజకీయ ముఖచిత్రం

ఆదిలాబాద్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా రాజకీయాల్లో ఎవరూ ఊహించని విధంగా రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలతో రాజకీయం రసవత్తరం గా మారింది. ఈ ఏడాది ప్రధానపార్టీలకు పెద్దగా కలిసి వచ్చినట్లు కనిపించ లేదు. 2023 డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘోరంగా ఓటమి పాలు కావడంతో దశాబ్ద కాలం తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల తర్వాత బలపడింది. 2024 జనవరి నుంచి డిసెంబరు వరకు జిల్లాలో వలస రాజకీయాల జోరు కనిపించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన జిల్లాలో ఆ పార్టీకి ఆశించిన స్థాయిలో స్థానాలు దక్కలేదు. అధికారంలో ఉండి పార్లమెంట్ స్థానాన్ని చేతులారా వదిలేసుకుందన్న అపవాదు కూడా వచ్చాయి. కాంగ్రెస్, బీజేపీలు గెలిచేందుకు చేసిన ప్రయత్నాలు కొంత వరకు ఫలించిన బీఆర్‌ఎస్ మూడవ స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. జిల్లాలో ప్రస్తుతం భిన్నమైన రాజకీయ పరిస్థితులు కనిపిస్తున్నాయి. అధికారంలో కాంగ్రెస్ ఉండగా స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీ మాత్రం ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు కావడం గమనార్హం. జిల్లాలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలు పూర్తిస్థాయిలో ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలు పాక్షికంగా కొనసాగుతున్నాయి. ఈ నాలుగు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఇద్దరు, బీజేపీకి ఒకరు, కాంగ్రెస్ నుంచి మరొకరు ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. గడిచిన పార్లమెంట్ ఎన్నికల్లో అగ్రనేతలంతా జిల్లాలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించా రు. ముఖ్యంగా ప్రధానమంత్రి మోదీతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్ జిల్లాలో నిర్వహించిన బహిరంగ సభల్లో పాల్గొని ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు నువ్వా? నేనా?అన్నట్లుగా బరిలోకి దిగిన సిట్టింగ్ స్థానాన్ని మళ్లీ కమలం పార్టే దక్కించుకుంది. ఓటర్లు మార్పు కోరుకోవడంతో జిల్లా రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



● పార్లమెంట్ ఎన్నికల్లో కేటీఆర్ సభకు హాజరైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

● పార్లమెంట్ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి సభకు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు

బీఆర్‌ఎస్‌కు వలసల బెడద

పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ 2023 డిసెంబర్ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోవడంతో ఆ పార్టీకి వలసల బెడద తప్ప లేదు. అధికారం కోల్పోవడంతో ముఖ్య నేతలంతా బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో చేరిపోయారు. దీంతో పార్టీ క్యాడర్ చెల్లాచెదురై పోయింది. ఎన్నికల ఓటమి నుంచి గట్టెక్క ముందే బీఆర్‌ఎస్‌ను నేతల వలసలు అతలాకుతలం చేశాయి. జిల్లాలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, రేఖాశ్యాంనాయక్, మాజీ ఎంపీ గోడం నగేష్, మాజీ డెయిరీ చైర్మన్ లోక భూమారెడ్డి, బాలూరి గోవర్ధన్ రెడ్డి, పలువురు జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు కాంగ్రెస్, బీజేపీలలో చేరిపోవడంతో బీఆర్‌ఎస్ జిల్లాలో కొంత డీలా పడినట్లు కనిపిస్తుంది. పనిలో పనిగా తాజా మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ కూడా కాంగ్రెస్, బీజేపీల్లో చేరి.. మళ్లీ ప్రస్తుతం బీఆర్‌ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నారు.

అధికారంలో ఉన్నా.. ఓటమి

2023 డిసెంబరులోనే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఆ తర్వాత 2024 మే 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తప్పలేదు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంపై అన్నిరకాల ప్రయత్నాలు చేసిన కాంగ్రెస్.. రెండవ స్థానానికే పరిమితమయ్యింది. మునుపెన్నడూ లేనివిధంగా మహిళా అభ్యర్థిని పార్లమెంట్ ఎన్నికల బరిలోకి దింపిన ఆశించిన ఫలితం కనిపించ లేదు. ముఖ్యంగా ఆదిలాబాద్ ఏజెన్సీపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించి ఆదివాసీ మహిళకు అవకాశం కల్పించింది. కానీ కమలం జోరుకు తట్టుకోలేక పోయింది. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకు బీఆర్‌ఎస్ పార్టీ నేతలకు గాలం వేసి పార్టీలో చేర్చుకుంది. కానీ అనుకున్న ఫలితం దక్కలేదు. ముఖ్యంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పార్లమెంట్ ఎన్నికల బాధ్యతను భుజాన వేసుకుని ఊరురా తిరిగి ప్రచారం చేసిన ఓటర్ల మద్దతు దక్కలేదు. దీంతో అధికారంలో ఉండి ఓటమి పాలయ్యామనే నిరాశ కాంగ్రెస్ శ్రేణుల్లో కనిపిస్తోంది.

పట్టు నిలుపుకున్న కమలం

ఆదిలాబాద్ పార్లమెంట్ సిట్టింగ్ స్థానాన్ని దక్కించుకున్న కమలం పార్టీ మళ్లీ తన పట్టు నిలుపుకుంది. 2024 జూన్ 4న వెలువడిన పార్లమెంట్ ఫలితాల్లో ఘన విజయం సాధించింది. సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావును పక్కన పెట్టి బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన గోడం నగేష్‌కు అవకాశం కల్పించడంతో పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించింది. అందరి అంచనాలను తారుమారు చేస్తూ రెండవ సారి కాషాయా జెండాను ఎగురవేసింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ హోరాహోరీగా ఫైట్ చేసిన 90 వేలకు పైగా మెజార్టీతో గోడం నగేష్ విజయం సాధించడం చర్చనీయాంశంగా మారింది. ప్రధానంగా మోదీ ఈమెజ్‌నే బలంగా నమ్ముకున్న కమళ దళంకు జిల్లాలో ఓటు

(తరువాయి 6వ పేజీలో...)



సీఆర్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న పీవో, డీడీలు

ప్రభుత్వం సానుకూలం.. సమ్మె విరమించండి : ఐటీడీఏ పీవో

ఉట్నూర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షి టీచర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని గిరిజన విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని సమ్మె విరమించాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త సీఆర్టీలను కోరారు. శనివారం సీఆర్టీ ప్రతినిధులను తన చాంబర్‌లోకి పిలిపించుకుని ఆమె మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, కార్యదర్శిలు సమస్యల పరిష్కారానికి సుముఖంగా ఉన్నారన్నారు. సకాలంలో వేతనాలు అందించడానికి చర్యలు తీసుకుంటామని, సమ్మె విరమించాలని కోరారు. ఇందులో డీడీ జాదవ్ వసంత్‌రావు ఉన్నారు. కాగా, సమ్మె శిబిరానికి చేరుకున్న ప్రతినిధులు పీవోతో జరిగిన చర్చల గురించి వివరించగా.. సీఆర్టీలు తమ డిమాండ్లు అన్ని అంగీకరించాలని, అప్పటి వరకు సమ్మె కొనసాగిస్తామని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

● ఐటీడీఏ జాబ్‌మేళాలో 239 మందికి ప్లేస్‌మెంట్

ఉట్నూర్(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన జాబ్ మేళాలో 239 మంది గిరిజన నిరుద్యోగ యువతకు ప్లేస్మెంట్ కల్పించడం జరిగిందని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులతో 44 మంది హాజరయ్యారన్నారు. ఉద్యోగాలు పొందిన వారు జాగ్రత్తగా ఉద్యోగాలు చేయాలని అన్నారు. ఉద్యోగాలు పొందిన వారు వేతనాలు సరిపోవడం లేదని తిరిగి గ్రామాలకు చేరుకుని వృధాగా ఉండడం కంటే.. వచ్చిన ఉద్యోగాలను బాగా చేసుకుని పదోన్నతులు పొందాలన్నారు. వేతనం పని తీరుతో పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ డీడీ వసంతరావు, బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మేస్రం మనోహర్, జేడీఎం నాగభూషణంతో పాటు వివిధ కంపెనీల ప్రతినిధులు, తదితరులు హాజరయ్యారు.

డీఆర్‌డీవో పీడీగా బాధ్యతలు స్వీకరించిన రవీందర్

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిగా రవీందర్ రాథోడ్ బాధ్యతలు స్వీకరించారు. శనివారం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. అనంతరం డీఆర్డీఏ పీడీగా పనిచేసిన సాయన్న బదిలీపై నిజామాబాద్ డిప్యూటీ సీవోగా వెళ్లారు. ఆయన స్థానంలో పెద్దపల్లి డీఆర్డీఏ పీడీగా పనిచేసిన రవీందర్ రాథోడ్ జిల్లా డీఆర్డీఏ పీడీగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. జిల్లా గ్రామీణాభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.



పీడీగా బాధ్యతలు స్వీకరిస్తున్న రవీందర్ రాథోడ్

ఆరోగ్య విషయాలపై అవగాహన అవసరం

● లక్ష్మీపూర్‌లో పర్యటించిన కలెక్టర్ రాజర్షిషా

జైనథ్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సమాజంలో గల ప్రతీ ఒక్కరు ఆరోగ్య విషయాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత ఆరోగ్య పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల విద్యార్థులతో పాటు ప్రతీఒక్కరు తమ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతో పాటు పౌష్టికాహారంపై దృష్టి సారించాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు రాసిన లక్ష్మీపూర్ బడి పిల్లల కథల పుస్తకాలను పరిశీలించారు. ఆ తర్వాత మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే, లక్ష్మీపూర్‌లో ఇందిరమ్మ సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లావిద్యాశాఖ అధికారి టి.ప్రణీత, మండల ప్రత్యేక అధికారి భాస్కర్, తహసీల్దార్ శ్యాంసుందర్, డిప్యూటీ తహసీల్దార్ రాథోడ్‌రాజేశ్వరి, ఎంపీఓ జి.వెంకట్‌రాజ్, ఎంఈవో జి.శ్రీనివాస్, హెచ్‌ఎం పి.అశోక్, లక్ష్మీపూర్, వీడీసీ చైర్మన్ దాసరి నారాయణలతో పాటు గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



లక్ష్మీపూర్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా



ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును పరిశీలిస్తూ..



మత్తు.. చిత్తు!

● సిరికొండలో జోరుగా కల్తీ కల్లు విక్రయాలు ● కల్లు దుకాణాలు, డిపోలపై నిఘా కరువు ● మత్తులో చిత్తువుతున్న యువత

వివరాలు 7వ పేజీలో...